సాక్షి మంచిర్యాల

శుక్రవారం। 19। మే। 2023



ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలి

ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలని శ్రీరాంపూర్ జీఎం జి.సంజీవరెడ్డి అన్నారు. శ్రీరాంపూర్, మందమర్రి జీఎం కార్యాలయాల్లో కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. 8లో▸



ఎస్‌బీఐలో అగ్నిప్రమాదం

లక్సెట్టిపేట మండల కేంద్రంలోని ఎస్‌బీఐ(ఏడీబీ) బ్రాంచిలో బుధవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఆస్తి నష్టం సంభవించకున్నా.. స్టేషనరీ కాలిపోయింది. 9లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 42.0 /29.0

ఉదయం ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రివేళ మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఏసీపీ నరేందర్

మంచిర్యాలక్రైం: నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో దోహదపడుతుందని, పోలీసులందరికీ అవగాహన ఉండాలని జైపూర్ ఏసీపీ నరేందర్ అన్నారు. గురువారం రామగుండం కమిషనరేట్ ప్రాంగణంలో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీసుస్టేషన్లలోని రైటర్లు, సైబర్‌వారియర్లు, టెక్‌టీమ్ వర్టికల్ ఆఫీసర్స్, సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పలు సూచనలు, సలహాలు, నేర పరిశోధనలో తీసుకోవల్సిన జాగ్రత్తలు, గత మార్చి నెలలో సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఏసీపీ నరేందర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు పోలీసుస్టేషన్‌కు వచ్చిన ప్రతీ పిటిషన్‌ను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు పెంచాలని తెలిపారు. టీఎస్ కాప్ మొబైల్ అప్లికేషన్ ద్వారా నేరస్థలం సందర్శించి అక్కడి నుంచే సంఘటన ఫొటోలు, వీడియోలు రికార్డు చేసి నేరానికి సంబంధించిన సాక్ష్యాధారాలను అప్‌డేట్ చేయవచ్చని తెలిపారు. శ్రీరాంపూర్ సీఐ రాజు, చెన్నూర్ సీఐ వాసుదేవరావ్, చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, సీసీఆర్బీ సీఐ బాబు రావ్, ఎస్సై వెంకట్, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

మండుటెండలో కురిసిన వర్షం



నష్టాన్ని అంచనా వేస్తున్న అధికారులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో గురువారం మండుటెండలో అకాల వర్షం కురిసింది. ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఓ మోస్తారుగా వర్షం పడింది. ఉరుములు, మెరుపులతో దాదాపు అరగంటకు పైగా వర్షం కురవడంతో కొద్దిసేపు వాతావరణం పూర్తిగా చల్లబడింది. అకాల వర్షానికి రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వరదనీరు మడుగులు కట్టింది.

గాలి దుమారంతో ఇళ్లు చెల్లాచెదురు

భీమిని: మండలంలోని వీగాం గ్రామ పంచాయతీలో గురువారం గాలిదుమారంతో 23 ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. ఆస్తి నష్టం ఏర్పడింది. నన్న శంకర్, గాండ్ల లస్మయ్య, గాండ్ల మల్లేష్, మల్లయ్య, మల్లేష్, దుమ్మ శంకర్, పటేల్‌కుమార్, స్వామి, కారం శంకర్, పేర స్వామి, సత్తయ్య, పబ్బతి దుర్గయ్య, అరిగెల రవిగౌడ్, భట్టు లింగయ్య, గాండ్ల గుండయ్య, వెంకటేష్, బుర్స సత్తయ్య, గట్టు శంకర్‌గౌడ్, శంకర్, మల్లయ్య, అరిగెల మొండాగౌడ్, పంజాల రాజాగౌడ్ ఇళ్లతోపాటు హన్మాన్ ఆలయ రేకులు ధ్వంసమయ్యాయి. రెవెన్యూ అధికారులు నష్టాన్ని అంచనా వేశారు.

25లోగా యూనిఫామ్‌లు సిద్ధం చేయాలి



దుస్తువులను పరిశీలిస్తున్న డీఈవో

చెన్నూర్: పాఠశాలల పునః ప్రారంభం నాటికి సర్వం సిద్ధం కావాలని, ఈ నెల 25లోగా యూనిఫామ్‌లను మండల వనరుల కేంద్రంలో సిద్ధంగా ఉంచాలని డీఈవో యాదయ్య అన్నారు. గురువారం డీఈవో చెన్నూర్‌లోని ఏకరూప దుస్తుల స్టిచింగ్ సెంటర్‌తోపాటు మన ఊరు–మనబడి పథకంలో చేపట్టిన పాఠశాల భవన నిర్మాణాలను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు అన్ని సౌకర్యాలతో పాఠశాలలో అడుగుపెట్టే విధంగా ఎంఈవోలు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా సెక్టోరియల్ అధికారి చౌదరి, ఎంఈవో రాధాకృష్ణమూర్తి ఉన్నారు.

24న జగిత్యాలలో విత్తనమేళా

బెల్లంపల్లి: జగిత్యాలలో ఈ నెల 24న విత్తనమేళా నిర్వహించనున్నట్లు బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం.రాజేశ్వర్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో రైతాంగానికి నాణ్యమైన, నూతన అధిక దిగుబడులను ఇచ్చే విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మంచిర్యాల, కుమురంభీం జిల్లాల పరిధిలోని రైతులు జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాన్ని సందర్శించి అవసరమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దాహం తీరే దారేది..!

- ఎండలతో వేడెక్కుతున్న నీరు
- బస్టాండ్లలో తాగునీటికి తిప్పలు
- ఆస్పత్రుల్లోనూ చల్లని నీరే కరువు

వేసవిలో మండుతున్న ఎండలతో గొంతు తడారుతోంది. చల్లని తాగునీటి కోసం దిక్కులు చూడాల్సి వస్తోంది. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ఆస్పత్రుల్లో తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నా కొన్ని చోట్ల చల్లని నీరు లేక వేడినీరే తాగాల్సి వస్తోంది. దుకాణాల్లో అధిక ధరలకు చల్లని తాగునీరు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.



మంచిర్యాల బస్‌స్టేషన్‌లో పక్కపక్కనే ఏర్పాటు చేసిన వాటర్ కూలర్లు

సాక్షి విజిట్

కూలర్లు ఉన్నా కొరతనే..

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల బస్టాండ్‌లో వాటర్ కూలర్లు ఉన్నా నీటి కొరత తప్పడం లేదు. అడుగంటిన బోరుతో ఎప్పుడు నీరొస్తుందో.. రాదో తెలియడం లేదు. ఓ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన వాటర్ కూలర్‌కు నేరుగా బోరు నుంచి నీరు సరఫరా జరుగుతోంది. మరొకటి ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన రూపాయికి నీరు(శుద్ధ జలం) సరఫరా అవుతోంది. రెండూ పక్కపక్కనే చెన్నూర్ ప్లాట్‌ఫారం వైపు ఏర్పాటు చేయడంతో కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ వెళ్లే ప్రయాణికులు ఇటు రాలేక వాటర్‌బాటిల్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. చల్లని నీరు సరఫరా అవుతున్నా సమయానికి రూపాయి నాణెం చేతిలో ప్రత్యామ్నాయంగా వాటర్‌బాటిల్ కొంటున్నారు. ఇదే అదునుగా ఒక్కో బాటిల్‌పై రూ.5 అదనంగా వసూలు చేస్తున్నారు. పర్యవేక్షణ లోపించడంతో కంపెనీల వాటర్ బాటిల్‌లు విక్రయించాల్సి ఉండగా తాగునీటి కవర్లు అమ్ముతున్నారు. ఇటీవల తాగునీటి పాట్లాలు తాగిన ఇద్దరు విద్యార్థులు వాంతులు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇంకోవైపు ట్యాంకు నుంచి నేరుగా కుళాయి ద్వారా సరఫరా చేసే తాగునీటి వద్ద అపరిశుభ్రంగా ఉండడంతో అటువైపు కన్నెత్తి చూసిన వారు తక్కువే. రెండు వైపులా ప్లాట్‌ఫారమ్‌ల వద్ద తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

తాగునీటి కుళాయి వద్ద అపరిశుభ్రంగా మారిన దృశ్యం



ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీటి తండ్లాట



తాగునీరందించని ఆర్టీసీ బస్టాండ్‌లోని ట్యాప్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీటి ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయి. చల్లని నీరు లేకపోగా కనీసం తాగడానికి నీటి సరఫరా కూడా సరిగా చేయడం లేదు. ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి ట్యాప్ వరకు ఏర్పాటు చేసిన పైపు జామ్ అయి చుక్కగా నీరు వస్తోంది. తాగునీరు క్లోరినేషన్ చేయడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో స్టాల్ లేక వాటర్ బాటిళ్లు సైతం కొనుగోలు చేసే అవకాశాలు లేవు. ప్రయాణికులు బజారు ఏరియా, ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న దుకాణాల నుంచి వాటర్ బాటిళ్లు కొనుగోలు చేస్తున్నారు. రైల్వేస్టేషన్‌లో వాటర్ కూలర్ ఉన్నా ప్రయాణికులకు ఉపయోగపడడం లేదు. ట్యాప్ నుంచి వస్తున్న వేడినీరు తాగలేక తప్పనిసరి పరిస్థితుల్లో వాటర్ బాటిళ్లు కొంటున్నారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగుల తాగునీటి ఇక్కట్లను తీర్చే చర్యలు చేపట్టలేదు.

వాటర్‌ఫిల్టరే దిక్కు

చెన్నూర్: చెన్నూర్ సీహెచ్‌సీలో వాటర్ ఫిల్టర్ నుంచి వేడి నీరు వస్తోంది. ఆస్పత్రిలో నలుగురు రోగులు ఉండగా.. ఔట్‌పేషంట్ల కోసం ఓ వార్డులో వాటర్ ఫిల్టర్ ఉంది. వేడి నీరు వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎండ వేడిమికి ఫిల్టర్ నీరు వేడెక్కుతున్నాయని తెలిపారు.



సీహెచ్‌సీలో రోగుల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్

వాటర్‌బాటిళ్లకు అధిక ధర

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు అధిక ధరకు వాటర్ బాటిళ్లు విక్రయిస్తున్నారు. బస్టాండ్ ఆవరణలోని తాగునీటి ఆర్వో వాటర్ ప్లాంటును కొందరు వినియోగించుకుంటున్నారు. లీటర్ బాటిల్ రూ.25, అర లీటర్ బాటిల్ రూ.15కు విక్రయిస్తున్నారు.

పని చేసేదొక్కటే..

మంచిర్యాలక్రైం: మంచిర్యాల రైల్వేస్టేషన్లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చల్లని తాగునీరు యంత్రాలు పని చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వేస్టేషన్‌లో మూడు ప్లాట్‌ఫామ్‌లు ఉండగా ఒకటో ప్లాట్‌ఫామ్‌పై రెండు చల్లని తాగునీరు యంత్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో ఒక్కటే పని చేస్తుంది. రెండు, మూడు ప్లాట్‌ఫాంలపై రెండు చల్లనితాగు నీరు యంత్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో రెండూ పని చేయడం లేదు. చల్లని నీరు దొరక్క ప్రయాణికులు విలవిలలాడిపోతున్నారు. మొదటి ప్లాట్‌ఫాంపైన దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన చల్లని తాగునీరు యంత్రం కూడా పని చేయకపోవడం రైల్వే అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.



చల్లని నీరు కోసం వచ్చి వెనుదిరిగిన ప్రయాణికుడి

గుట్టపైన మాత్రమే చల్లని నీరు..

దండేపల్లి: నిత్యం భక్తులతో రద్దీగా ఉండే గూడెం సత్యనారాయణస్వామి ఆలయం వద్ద గుట్టపైన మాత్రమే భక్తుల కోసం చల్లని నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. గుట్టకింద ఉన్న భక్తులు దాహం వేస్తే సమీప హోటళ్లు, దుకాణాల్లో లీటరుకు రూ.5 వెచ్చించి చల్లని నీరు కొనుక్కుంటున్నారు. పౌర్ణమి జాతర సమయంలో మాత్రమే భక్తుల కోసం చల్లని నీటిని అందుబాటులో ఉంచుతున్నారు. మిగతా రోజుల్లో ఉంచడం లేదు. గుట్ట కింద రావి చెట్టు వద్ద ఉన్న శుద్ధ జల ప్లాంటు సరిగా పనిచేయడం లేదు. హోటళ్లు, దుకాణాల్లో గతంలో కంటే చల్లని నీటి అమ్మకాలు పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు.



దండేపల్లి: గూడెం గుట్టపై భక్తుల కోసం ఏర్పాటు చేసిన చల్లని నీరు

చల్లని నీరు లేదు...

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో వేర్వేరు చోట్ల నిర్వహిస్తున్న మాతాశిశు ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చల్లని తాగునీరు అందడం లేదు. మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేసి, ఫ్రిడ్జ్‌కు కనెక్షన్ ఇచ్చారు. ఆసుపత్రి మొత్తానికి ఒక్కటే ఆర్వో ప్లాంట్, ఫ్రిడ్జ్ ఉండడం, రోజుకు 200కు పైగా గర్భిణులు, సహాయకులు ఆసుపత్రికి వస్తుండడంతో తాగు నీరు సరిపోవడం లేదు. ఆర్వో ప్లాంటు నుంచి వచ్చే సాధారణ నీటినే తాగాల్సిన పరిస్థితి ఉంది. ఐబీ చౌరస్తాలో ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మూడు ఫ్రిడ్జ్‌లూ పాడవడంతో సర్వీసింగ్‌కు ఇచ్చారు. ఒక్కో ఫ్లోర్‌కు రెండు ఆర్వోప్లాంట్లు ఇటీవల మంజూరు కాగా, అవి అందుబాటులోకి వచ్చేందుకు మరింత సమయం పట్టనుంది.



మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఆర్వో ప్లాంటు ద్వారా తాగునీటిని పట్టుకుంటున్న మహిళ

టికెట్ కోసం పోటాపోటీ!

- మంచిర్యాల అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్సీ 'పురాణం'
- అదే దారిలో 'పుస్కూర్', మరికొందరు నాయకులు
- 'సిట్టింగ్'ను మార్చితే తమకు ఇవ్వాలని సంకేతాలు
- నియోజకవర్గంలో మొదలైన నేతల హడావుడి



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ కోసం అధికార బీఆర్‌ఎస్ పార్టీలో పోటాపోటీ నెలకొంది. జిల్లాలో ఏకైక జనరల్ స్థానం మంచిర్యాల కావడంతో ఆశావహుల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. పలువురు ఈ స్థానం నుంచి పార్టీ టికెట్ ఆశిస్తుండడంతో రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో బెల్లంపల్లి, చెన్నూరు ఎస్సీలకు, ఖానాపూర్ ఎస్టీలకు రిజర్వు అయ్యాయి. మంచిర్యాల మాత్రమే జనరల్ స్థానం కావడంతో అనేకమంది టికెట్ కోసం పోటీ పడుతున్నారు. ఈ ఏడాది చివరిలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పటి నుంచి అభ్యర్థులు బీ ఫారం కోసం రంగంలోకి దిగారు. ఇందులో సీనియర్ల నుంచి కింది స్థాయి నాయకుల వరకు అందరూ ఉన్నారు. ఎవరికి వారు తమ ప్రయత్నాల్లో శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. పోటీలోనే ఉంటామని సంకేతాలు ఇస్తున్నారు. అంతేగాకుండా నియోజకవర్గ ప్రజల్లో మద్దతు కూడగట్టుకునేలా పర్యటనలు చేస్తున్నారు. సిట్టింగ్ స్థానాన్ని మార్చుతారనే కోణంలోనే అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

పట్టుబిగిస్తున్న 'పురాణం'

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తెలంగాణ ఉద్యమం నుంచి మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ పార్టీలో సీనియర్ నాయకులుగా ఉన్నారు. తూర్పు జిల్లా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆసిఫాబాద్, మంచిర్యాల పరిధిలోని ఐదు నియోజకవర్గాలను సమన్వయం చేసిన పేరుంది. కొత్త జిల్లాల అధ్యక్షులుగా ప్రకటించే వరకు 14ఏళ్లపాటు జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. ఉద్యమంలో పలుమార్లు జైలుకు వెళ్లారు. కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఆయనతో ఉన్నారని చెబుతారు. గతంలో మంచిర్యాల, సిర్పూర్‌లో ఏదో ఒక చోట నుంచి పోటీ చేయాలనుకున్నా కుదరలేదు. చివరకు స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. రెండోసారి ఆయనకే అవకాశమిస్తారని అనుకున్నా ఇవ్వలేదు. ఈ క్రమంలో మంచిర్యాల సిట్టింగ్ ఎమ్మెల్యేను మారిస్తే తనకే తప్పకుండా సీటు ఇస్తారనే ఆశతో ఉన్నారు. తాను కూడా బరిలో ఉన్నట్లు సంకేతాలు పంపుతున్నారు. నియోజకవర్గంపై దృష్టి సారించి విస్తృతంగా పర్యటనలు చేస్తున్నారు. గత నెల రోజులుగా దండేపల్లి, హాజీపూర్, జిల్లా కేంద్రంతో సహా బొగ్గు గని కార్మికులతో స్థానిక సమస్యలను తెలుసుకుంటున్నారు. కార్యకర్తలతో నియోజకవర్గంలో పర్యటనలు చేస్తున్నారు. పార్టీ కేడర్‌తో టచ్‌లో ఉంటున్నారు. ప్రజాసమస్యలపై స్పందిస్తున్నారు. 'పురాణం'కు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తో సన్నిహితులుగా పేరుంది. 'ఉద్యమ కాలం నుంచి పార్టీలో పని చేస్తున్నాం. ఎన్నో కష్టాలకు ఓర్చి పార్టీని బలోపేతం చేశాం. మాకు కూడా టికెట్ అడిగే హక్కు ఉంటుంద'ని 'పురాణం' తన అభ్యర్థిత్వాన్ని బయటపెడుతున్నారు. అవకాశం ఇస్తే పోటీ చేసి గెలుస్తాననే ధీమా వ్యక్తం చేస్తున్నారు.



పురాణం సతీశ్‌కుమార్

'బీసీ కార్డు'తో అభ్యర్థిత్వం

పార్టీలో ఉన్న పలువురు బీసీ నాయకులు టికెట్ ఆశిస్తున్నారు. బీసీ కోటాలో మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉన్న గాజుల ముఖేశ్‌గౌడ్ ఆశలు పెట్టుకున్నారు. బీసీ నాయకులకు చాన్స్ ఇస్తే పోటీకి సిద్ధపడినట్లు చెప్పుకుంటున్నారు. గతంలో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీకి సిద్ధమయ్యారు. బీఆర్‌ఎస్‌లో చేరాక టికెట్ ఆశిస్తున్నారు. కార్మిక సంఘాలు, సంస్థలకు ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నియోజకవర్గంలో ఈయనతోపాటు పలువురు బీసీ నాయకులు సైతం టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు.



ముఖేశ్‌గౌడ్

రేసులో 'పుస్కూర్'

బీఆర్‌ఎస్ నుంచే మరో నాయకుడు, రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, సినీ నిర్మాత పుస్కూర్ రామ్ మోహన్‌రావు సైతం టికెట్ బరిలో ఉంటూ కార్యక్రమాలు చేస్తున్నారు. గతంలోనూ టికెట్ ఆశించారు. చివరకు కార్పొరేషన్ పదవి దక్కింది. ప్రస్తుతం కాసిపేట మండలం దేవాపూర్‌లో ఉన్న ఓరియంట్ సిమెంట్ కంపెనీ(ఓసీసీ) గుర్తింపు కార్మిక సంఘ అధ్యక్షుడిగా ఉన్నారు. ఇటీవల మంత్రి కేటీఆర్ పర్యటనలోనూ ఆయన వెంట ఉన్నారు. తాజాగా నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలను కలుస్తున్నారు. ఈసారి టికెట్ ఇవ్వాలని సంకేతాలు పంపుతున్నారు. స్థానిక సమస్యలపై స్పందిస్తూ సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ క్రమంలో తను కూడా టికెట్ కోసం రేసులో ఉన్నట్లు చెబుతున్నారు. 'మేం కూడా టికెట్ ఆశిస్తున్నాము. అయితే పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పని చేస్తామ'ని చెబుతూనే తన అభ్యర్థిత్వాన్ని అధిష్టానం ముందుంచుతున్నారు.



రామ్ మోహన్‌రావు

తండ్రీకొడుకుల ఆరాటం

మరో వైపు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న నడిపెల్లి దివాకర్‌రావు ఈసారి కూడా తనకే టికెట్ ఇస్తారనే నమ్మకంతో ఉన్నారు. ప్రజల్లో ఉంటూ, అభివృద్ధి పనులను పూర్తి చేయిస్తున్నారు. ఆయన తనయుడు విజిత్‌రావు సైతం నియోజకవర్గంలో పట్టు పెంచుకునేలా కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ క్రమంలో తండ్రీకొడుకులు ఇరువురు కూడా టికెట్ కోసం పోటీలో ఉన్న పరిస్థితి నెలకొంది.

ఎమ్మెల్యే దివాకర్ రావు, విజిత్‌రావు →





నర్సరీల నిర్వహణపై శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్

జైపూర్: పల్లెల్లో పారిశుధ్యం, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాల నిర్వహణపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. మండలంలో స్వచ్ఛ సర్వేక్షన్‌కు ఎంపికైన కాన్కూర్ గ్రామ పంచాయతీని గురువారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని, నివాస ప్రాంతాలు, అంతర్గత రహదారులు, రోడ్లకు ఇరువైపులా శుభ్రత పాటించాలని, మురుగు కాలువల్లో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని, ప్రతీరోజు ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించారు. ఇందులో ఉపయోపడే చెత్తను వేరు చేసి కంపోస్ట్ ఎరువు తయారీకి వినియోగించాలని తెలిపారు. నర్సరీలు, పల్లెప్రకృతి వనాల్లో మొక్కల ఎరువుగా వాడాలని తెలిపారు. పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. నర్సరీల్లో మొక్కల పెంపకం సమర్థవంతంగా చేపట్టాలని, తెలంగాణ హరితహారం లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు సిద్ధం చేయాలని చెప్పారు. పల్లెప్రకృతి వనాల్లో మొక్కలకు సకాలంలో నీటిని అందించాలని, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీవో బాలయ్య, సర్పంచ్ వెంకటేశ్వర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి సురేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు బాల శాస్త్రవేత్తలుగా ఎదగాలి



శిబిరం ముగింపు సందర్భంగా విద్యార్థులతో రాహుల్

మంచిర్యాలఅర్బన్: పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు మొగ్గు చూపి బాలశాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా సైన్స్ కేంద్రంలో నిర్వహిస్తున్న సైన్స్ సమ్మర్ క్యాంపు ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర్చుకున్న పరిజ్ఞానంతో సమాజ సమస్యల పరిష్కారానికి ఆవిష్కరణలు చేయాలని తెలిపారు. వేసవి సెలవుల్లో పిల్లలు హైదరాబాద్ బిర్లాసెంటర్, వరంగల్ రీజినల్ సైన్స్ సెంటర్లను చూపించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో మధుబాబు, ఉపాధ్యాయులు జాకీర్‌హుస్సేన్, రాజేశం, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించడమే కాకుండా 10 జీపీఏ సాధించిన కామెర సాయితేజ, జే.తిరుపతి, 9.8జీపీఏలు సాధించిన కార్తీక్, హర్షిత్‌లను జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శాలువాలతో సన్మానించి అభినందించారు. ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పేరు తేవాలని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కేవీఎం ప్రకాశ్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఖేలో ఇండియా ఎంపిక పోటీలు జూన్ 9 నుంచి 12వరకు ఆజాది కా అమృత్ మహోత్సవ్, కలింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, భువనేశ్వర్, ఒడిశా రాష్ట్రంలో నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 19 నుంచి పది క్రీడల్లో పోటీలు నిర్వహిస్తామని, హైదరాబాద్‌లోని హకీంపేట్ టీఎస్‌ఎస్‌ఎస్ మైదానంలో ఆర్చరీ, జింఖానా గ్రౌండ్‌లో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, రగ్బీ, వాలీబాల్, జింఖాన గ్రౌండ్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్మింగ్, ఎల్‌బీ స్టేడియంలో యోగాసనాలకు సంబంధించిన క్రీడలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎస్టీలకు మాత్రమే అవకాశం ఉందని, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డులతో క్రీడాకారులు ఎంపిక పోటీలు నిర్వహించే స్టేడియంలో సంప్రదించాలని తెలిపారు.

క్లుప్తంగా

గుడుంబా విక్రయదారులపై కేసు

దహెగాం: మండలంలోని మర్రిపల్లి, ఇట్యాల గ్రామాలకు చెందిన పలువురు గుడుంబా విక్రయదారులపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. మర్రిపల్లిలో పలువురు ఇళ్లలో సోదాలు నిర్వహించగా ధ రవాత్ రాములు, జర్పుల రాజ్‌కుమార్, ధరవాత్ కిరణ్, జర్పుల ఇందాల్, జర్పుల బిక్కు వద్ద నుంచి 21 లీటర్ల గుడుంబా, ఇట్యాల గ్రామానికి చెందిన మొర్లె నగేష్ ఇంట్లో నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తునికాకు కూలీకి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాస్

వేమనపల్లి(బెల్లంపల్లి): తునికాకు సేకరణకు వెళ్లిన ముల్కలపేట గ్రామానికి చెందిన ఎల్కరి శ్రీనివాస్ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. గురువారం తునికాకు సేకరణకోసం గ్రామ సమీపంలోని అటవీప్రాంతానికి వెళ్లాడు. చెట్టు ఎక్కి ఆకు తెంపుతుండగా పైనుంచి వెళ్తున్న విద్యుత్ వైరు తాకడంతో షాక్‌కు గురై కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వారు గమనించి ఇంటికి తీసుకువచ్చారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఒకరి అదృశ్యం


కట్ల గౌరయ్య (ఫైల్)

తాండూర్(బెల్లంపల్లి): మండలంలోని కాసిపేట గ్రామానికి చెందిన కట్ల గౌరయ్య ఈ నెల 16న అదృశ్యమైనట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. 16న సాయంత్రం వ్యక్తిగత పనుల నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లిన గౌరయ్య రెండు రోజులైనా ఇంటికి రాకపోవడంతో అతని భార్య కళావతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గౌరయ్య ఆచూకీ తెలిసినవారు తాండూర్ పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

ఆసిఫాబాద్: మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని గురువారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆదిలాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఎంపీ గోడం నగేశ్ హైదరాబాద్‌లోని అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో రహదారుల అనుమతులు, దేవాలయాల అభివృద్ధిపై మంత్రితో చర్చించారు. దీంతో పాటు జిల్లాకు నూతన దేవాలయాలు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి ప్రతిపాదనలు పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మా వడ్లు ఎందుకు కొనరు?

- 25 రోజులుగా కేంద్రంలోనే పడిగాపులు
- కొనుగోళ్లలో జాప్యం చేస్తున్న నిర్వాహకులు
- ఆవేదన వ్యక్తం చేస్తూ నిరసనకు దిగిన దళిత రైతులు


గుడిపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనాలంటూ ప్రాధేయపడుతున్న రైతులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): దళితులు పండించిన పంట పనికిరాదా? దళితుల వడ్లు కొనడంలో ఎందుకీ వివక్ష.. కళ్లంలోకి తెచ్చిన వరిధాన్యం 25 రోజులైనా కొంటలేరు... దళితలమైనందుకే మా వడ్లు కొంటలేరు.. అయినా మా పంట కొనుగోలుకు నిర్వాహకులు పెడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.. అంటూ హాజీపూర్ మండలంలోని గుడిపేట-నంనూర్ గ్రామాల దళిత రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

నిర్వాహకుల వింతధోరణి

హాజీపూర్ మండలంలోని గుడిపేట శివారులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిర్వాహకుల తీరు వింత ధోరణి తలపిస్తోంది. గుడిపేట-నంనూర్ గ్రామాలకు చెందిన పలువురు దళిత రైతులు 25 రోజుల క్రితమే వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చారు. కేంద్రం నిబంధనల మేరకు కుప్పలుగా అరబెట్టి ఎప్పుడు కొంటారోనని ఎదురు చూస్తున్నారు. వీరి తర్వాత కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని కాంటా వేసిన నిర్వాహకులు వెంటనే మిల్లులకు తరలిస్తున్నారు. దళితులకు చెందిన ధాన్యం చిన్నచిన్న కుప్పలుగా ఉండడంతో నిర్వాహకులు వివక్ష చూపుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్వాహకులు, హమాలీలు కుమ్మక్కై పెద్ద రైతుల ధాన్యం కొంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే సంచులు తెచ్చుకోండని, రైస్‌మిల్లుల వారితో మాట్లాడుకోండని, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని మొహంమీదే చెప్పడమే కాకుండా మా ధాన్యాన్ని కనీసం చూడటం లేదని వాపోతున్నారు. దీంతో చేసేదేం లేక గురువారం దళిత రైతులు కొనుగోలు కేంద్రంలో నిరసనకు దిగారు. 20 రోజులకు పైగా ధాన్యానికి కాపలా ఉంటున్నాం.. ఇంటి పని, ఇంటోల్లను వదిలి ఇక్కడే ఉంటున్నాం.. అంటూ కష్టాలు చెప్పుకొచ్చారు. తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

నా తర్వాత వచ్చిన వడ్లు కొంటుండ్రు



నాకున్న ఎకరం పొలంలో పంటకోత కోసి 25 రోజుల క్రితమే కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చా. ఇక్కడే ఉంటూ వడ్లు ఆరబెట్టిన. నా తర్వాత తీసుకువచ్చిన వడ్లను కొంటున్నారు. అడిగితే మాతో మాట్లాడకండి అంటూ బూతులు తిడుతుండ్రు. అధికారులు స్పందించి మావడ్లు కొనేలా చూడాలి.

– బిడ్డెల శ్రీనివాస్, దళిత రైతు, గుడిపేట

ఒంటరితనం భరించలేక ఆత్మహత్య


శ్రీనివాస్(ఫైల్)

మంచిర్యాలక్రైం: ఒంటరితనం భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలోని హమాలివాడలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక హమాలివాడకు చెందిన శీలం శ్రీనివాస్(42) మెకానిక్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై తరచూ భార్య సరితతో గొడవపడేవాడు. భర్త వేధింపులు భరించలేక సరిత ఫిబ్రవరి 28న ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతు మార్చి 12న మృతి చెందింది. ఆమె మృతికి కారణమైన శ్రీనివాస్‌పై స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మే 8న బయటకు వచ్చిన శ్రీనివాస్ ఒంటరితనం భరించలేక మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 13న కాలేజ్ రోడ్‌లోని భార్య సమాధి వద్దకు వెళ్లి పురుగుల మందుతాగాడు. గమనించిన స్థానికులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని సోదరుడు వీరేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

జన్నారం(ఖానాపూర్): కట్టుకున్న భర్త మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడంలేదని మనస్థాపానికి గురై మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలం రేండ్లగూడకు చెందిన వెయిగండ్ల మహేశ్‌తో మంచిర్యాలకు చెందిన నిత్య (27)తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు కుమారుడు, కూతురు సంతానం. ఏపని చేయకుండా ఖాళీగా తిరిగే మహేశ్ నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చేవాడు. మద్యం మానాలని పలుమార్లు చెప్పినా అతని ప్రవర్తనలో మార్పురాకపోవడంతో మనస్థాపం చెందింది. బుధవారం రాత్రి ఇంటిముందున్న పందిరికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి యసవంతుల శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బీమాకోసం తప్పుడు ధ్రువీకరణపత్రం జారీ

- విచారణ చేపట్టిన ఆర్డీవో


విచారణ చేస్తున్న ఆర్డీవో జాడి రాజేశ్వర్

కౌటాల(సిర్పూర్): రైతు బీమా డబ్బుల కోసం ఓ గ్రామ పంచాయతీ కార్యదర్శి తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేసిన ఘటనపై గురువారం ఆర్డీవో విచారణ చేపట్టారు. గుడ్లబోరి గ్రామ పంచాయతీ పరిధిలోని వైగాం గ్రామానికి చెందిన చౌదరి నానాజీ 2018 జూలై 16న మృతి చెందాడు. సదరు కుటుంబానికి రైతుబంధు వర్తింపజేసేందుకు అప్పటి పంచాయతీ కార్యదర్శి జలందర్ అత్యుత్సాహం ప్రదర్శించి 2018 ఆగస్టు 17న మృతి చెందినట్లు తప్పుడు మరణ ధ్రువీకరణపత్రం జారీ చేశాడు. సదరు కుటుంబం రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోగా వ్యవసాయ అధికారులు విచారణ చేపట్టారు. అంగన్‌వాడీ, ఆశ వర్కర్ల రికార్డుల్లో 2018 జులై 16న మృతి చెందినట్లు ఉండడంతో పథకానికి అనర్హులని తేల్చిచెప్పారు. దీంతో మృతుని కుటుంబ సభ్యులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ ఇన్‌చార్జి ఆర్డీవో జాడీ రాజేశ్వర్ విచారణ చేపట్టారు. అంగన్‌వాడీ, ఆశ వర్కర్ల రికార్డులు పరిశీలించి నానాజీ 2018 జులై 16న మృతి చెందినట్లు విచారణలో తేలింది. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సాయన్న, ఏవో రాజేశ్, సర్పంచ్ పాలె రాందాస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

ఓసీపీ బదిలీలకు 37 మంది ఆప్షన్లు

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఓసీపీలకు బదిలీపై వెళ్లడానికి 37 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. అండర్ గ్రౌండ్ ఓవర్‌మెన్లు, హెడ్ ఓవర్‌మెన్లు ఓసీపీకి బదిలీపై వెళ్లడానికి గురువారం శ్రీరాంపూర్ వీటీసీలో వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. శ్రీరాంపూర్, మందమర్రి డివిజన్లకు చెందిన మొత్తం 78 మంది హాజరుకాగా అందులో 37 మంది ఆప్షన్‌లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఎస్ఈ కిరణ్‌కుమార్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, డీవైపీఎం రాజేశ్వర్ పాల్గొన్నారు.

క్వార్టర్ ఖాళీ చేయించిన సెక్యూరిటీ సిబ్బంది

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని మూడో జోన్ రామాలయం వెనుక లైన్‌లో ఉన్న 574 నంబర్‌గల క్వార్టర్‌ను కేకే-5 గని కార్మికుడైన రాజ్‌కుమార్‌కు సంస్థ యాజమాన్యం కేటాయించింది. కానీ రాజ్‌కుమార్ క్వార్టర్ వద్దకు వెళ్లి చూడగా కార్మికేతరులు అందులో ఉండడంతో యాజమాన్యానికి ఫిర్యాదు చేశాడు. అధికారులు సెక్యూరిటీ సిబ్బందితో కలిసి గురువారం క్వార్టర్ వద్దకు వెళ్లి సామాను బయట పెట్టారు. సింగరేణి క్వార్టర్లలో అక్రమంగా ఉంటే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

రక్తదానంపై అపోహలు వద్దు


శిబిరంలో అదనపు కలెక్టర్

దండేపల్లి: రక్తదానంపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అన్నారు. దండేపల్లి రెవెన్యూశాఖ, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య వంతులైన 18 నుంచి 50 ఏళ్ల లోపు వారు రక్తదానం చేయవచ్చన్నారు. జిల్లాలోని తలసేమియా వ్యాధి గ్రస్తుల కోసం రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా రక్తాన్ని అందుబాటులో ఉంచేందుకు, జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ హన్మంతరావు, డీటీ విజయ, ఎంపీడీవో మల్లేశం, ఎంఈవో రవీందర్, ఆర్ఐ రంజిత్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరు మృతి


సతీష్‌గౌడ్ (ఫైల్)

జైపూర్(చెన్నూర్): ప్రమాదవశాత్తు బావిలోపడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని షెట్‌పల్లి గ్రామానికి చెందిన కోరకొప్పుల సతీష్‌గౌడ్ (33)సమీప బంధువైన పులి శ్రీనివాస్‌తో కలిసి బుధవారం నస్పూర్‌లో జరిగిన శుభకార్యానికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగివస్తున్న క్రమంలో బెల్టుషాపులో మద్యం సేవించి పులి శ్రీనివాస్ పొలంలోని బావి సమీపంలో నిద్రించారు. రాత్రి ప్రమాదవశాత్తు బావిలోపడి మృతి చెందాడు. గమనించిన శ్రీనివాస్ వెంటనే మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతుని భార్య సంధ్యారాణి తన భర్త మృతి పట్ల పులి శ్రీనివాస్‌పై అనుమానం ఉందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి మహిళ మృతి


మృతదేహానికి పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని లక్ష్మీకాంతాపూర్‌కు చెందిన బాదినేని కళావతి (40) గురువారం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి కిందపడి మృతి చెందింది. ఎస్సై కుందారపు ప్రసాద్, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..కళావతి తమ సొంతపొలంలో వడ్లు తీసుకు వచ్చేందుకు ట్రాక్టర్‌పై వెళ్తుండగా డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో ఒక్కసారిగా ఎగిరి కిందపడింది. ఈక్రమంలో ట్రాక్టర్ ఆమె పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త మురళీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో వ్యాపారి మృతి


నజీర్ హైమద్(ఫైల్)

మంచిర్యాలక్రైం: పట్టణంలోని ఎక్సల హైమద్ నగర్‌కు చెందిన నజీర్ హైమద్ (58) గురువారం వడదెబ్బతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పసుపుకొమ్ముల వ్యాపారం చేసే నజీర్ హైమద్ పసుపు కొమ్ములను ఇంటి సమీపంలో ఎండకు ఆరబెట్టాడు. వాటిని చూసేందుకు వెళ్లి అక్కడే కిందపడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య షమీమ్ సుల్తాన్, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

గాంధీనగర్‌లో ఇరువర్గాల దాడి

ఇచ్చోడ(బోథ్): మండలంలోని గాంధీనగర్‌లో బుధవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన దాడిలో 11మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ముదావత్ నైలు, ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. బుధవారం రాత్రి గాంధీనగర్‌లో దారికి అడ్డంగా వాహనం నిలిపిన సంఘటనలో ఇరువర్గాల మధ్య దాడి జరిగినట్లు తెలిపారు. ఘటనలో షేక్ బాబుమియ, హెక్‌ఆరీఫ్, షేక్ అజం, షేక్ కరీం, సర్పటే నందకిషోర్, ముండే వికాస్, ముండే బాలజీ, కాగ్నె గణేశ్, ముండే రాజు, గుట్టె ఆకాశ్, కేంద్రే స్వరూప్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గురువారం సాయంత్రం ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ సందర్శించి గ్రామస్తులు సమన్వయం పాటించాలని కోరినట్లు పేర్కొన్నారు.

ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి


నియామక పత్రాలతో అభ్యర్థులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు బాధ్యతగా పనిచేయాలని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో 32 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగం చేయడం అదృష్టంగా భావించాలన్నారు. ఉద్యోగంలో చేరిన తరువాత సర్ఫేస్ జాబ్ కోసం ప్రయత్నం చేయకుండా అధికారులు అప్పగించిన పనులు చేయాలన్నారు. గైర్హాజరు లేకుండా పనిచేస్తూ సింగరేణిని లాభాల బాటలో తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. క్రమశిక్షణతో పనిచేసి సంస్థలో మంచి ఉద్యోగిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఇప్పటి వరకు 11,052 మందికి, శ్రీరాంపూర్‌లో 3,274 మందికి కారుణ్య ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదీర్, డీజీఎం అరవిందరావు, డీవైపీఎం రాజేశ్వర్, సీనియర్ పీవో కాంతారావు, రాజయ్య పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత

మందమర్రిరూరల్: ఏరియాలోని జీఎం కార్యాలయ ఆవరణలో గురువారం పది మంది యువకులకు ఏరియా జీఎం మోహన్‌రెడ్డి కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సహకరించాలని జీఎం కోరారు. ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌పీలో వసతులు కల్పించాలి


మాట్లాడుతున్న రఘునాథ్‌రావు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో ఉద్యోగులకు కనీస వసతులు కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు డిమాండ్ చేశారు. గురువారం సీహెచ్‌పీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎండలో పనిచేస్తున్నా కనీసం మజ్జిగ నీళ్లు కూడా ఇవ్వడం లేదన్నారు. పని స్థలాల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసిన నాయకులపై డీజీఎం కక్ష సాధింపుల చర్యలకు పాల్పడుతున్నారన్నారు. యాజమాన్యం ఇప్పటికైనా స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్, నాయకులు జాడి ఈశ్వర్, కాదాసు భీమయ్య, జోగుల ప్రభాకర్, రాకేశ్, తొటం భాస్కర్, సురేశ్, సత్యం పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన నాణ్యత ప్రమాణాల బృందం


మాట్లాడుతున్న బృందం సభ్యులు

కాసిపేట: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని గురువారం జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం సభ్యులు సందర్శించారు. సభ్యులు మనోజ్ మిశ్ర, వైశాలి దత్తాత్రేయ ఆధ్వర్యంలో అన్నిరకాల వైద్య సేవలు, పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. జాతీయ స్థాయిలో గుర్తింపు ఇవ్వడానికి సౌకర్యాలు వసతులు పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం ఆస్పత్రి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈకార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు, డెప్యూటీ డీఎంహెచ్‌వో విజయ పూర్ణిమ, డాక్టర్ రవి కిరణ్, డీపీవో ప్రశాంతి, ఎన్‌క్యూఏఎస్ కోఆర్డినేటర్లు అల్లాడి శ్రీనివాస్, సిబ్బంది, ఆశలు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛ్ సర్వేక్షణ్ అవార్డు ఎంపికపై సమీక్ష


కంపోస్ట్ షెడ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని టీకానపల్లి గ్రామ పంచాయతీ స్వచ్ సర్వేక్షణ్ గ్రామీణ అవార్డుకు ఎంపికైంది. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ రాంటెంకి మల్లేశ్వరి అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేశారు. గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరైన డీపీఓ వెంకటేశ్వర్‌రావు గ్రామంలోని నర్సరీ, ప్రకృతి వనం, ఇంకుడు గుంతలు, క్రీడా ప్రాంగణం, కాంపోస్ట్ షెడ్, వైకుంఠధామం తదితర అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో సమీక్షించారు. మండల ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి, డీఎల్‌పీవో ప్రభాకర్ రావు, ఎంపీడీవో అబ్దుల్‌హై, ఎంపీవో శ్రీనివాస రెడ్డి, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఉప సర్పంచ్ జితేందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ


డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాలు సేకరిస్తున్న ఎస్సై

తాండూర్: కిష్టంపేట పంచాయతీ పరిధిలోని తాండూర్ బస్టాప్ సమీపంలో ఉన్న చిలుముల శ్రీధర్ ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. శ్రీధర్ ఈ నెల 16న జమ్మికుంటలోని తన బంధువుల ఇంటికి వెళ్లాడు. బుధవారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా బీరువా తెరిచి ఉంది. బట్టలు, ఇతర వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని నాలుగు తులాల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై రాజశేఖర్, డాగ్‌స్క్వాడ్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ముగిసిన 'జంగుబాయి' జాతర



ఆదివాసీల ఆరాధ్యదైవం జంగుబాయి జాతర ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. నెల రోజులుగా భక్తులు మర్రిచెట్టు, పోచమ్మ, రావుడ్, మైసమ్మ, జంగుబాయి వద్ద తమ మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 150 మేశాలు దర్శించుకున్నాయని కటోడాలు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లాతో పాటు ఆరు రాష్ట్రాలకు చెందిన నాలుగువేల మంది ఆదివాసీలు అమ్మవారిని దర్శించుకున్నారు. సిద్దికస, దారికస, విజ్జకస, టొప్లకస ప్రాంతాల్లోని నదుల్లో నుంచి గంగాజలాన్ని తీసువచ్చి గురువారం ఉదయం దేవతా విగ్రహాలను శుద్ధిచేశారు. శుద్ధి కార్యక్రమంతో జంగుబాయి ఉత్సవాలు ముగిశాయి. – కెరమెరి(ఆసిఫాబాద్)


